# మరో సారంగధరుని కథ

—మేరెడ్డి యాదగిరిరెడ్డి

సురేష్ స్కూటర్ ఇంటిముందు షెడ్‌లో పెట్టి, గేటుతెరుచుకొని బూట్లు టకటకలాడించుకుంటూ ఈలవేసి వరండాలో అడుగుపెట్టాడు. రాత్రి పదిగంటయింది పట్టణం ట్యూబ్‌లైట్లు వెలుతురుతో చల్లటి పిల్లగాలితో అప్పుడే త్రాగినవాడిలా నిషాలో జోగుతుంది. సురేష్ ఆకాశంవంక చూశాడు. అమావాస్య నిశిరాత్రి అక్కడక్కడ నక్షత్రాలు మెరుస్తున్నాయి. ప్రక్క యింటినుండి రేడియో సంగీతం సన్నగా వినిపిస్తుంది. ప్రక్కగదినుండి మల్లెలవాసన గమ్మున వచ్చింది. వరండాలో ట్యూబ్‌లైట్ వెలుగుతుంది. దానిచుట్టు పురుగులు, పురుగులతినేందుకు బల్లి కాసుకునే వున్నది సురేష్‌కు తండ్రిగదిలో లైటు వెలుగు తుండడం కనిపించింది. టైముచూసుకున్నాడు. సరిగ్గా పదిగంటల పదినిమిషాలు. నాన్న ఎప్పుడో పడుకోవాలిగదా! రాలేదేమో? బుర్ర గోక్కున్నాడు అప్పుడిగ్గాని తండ్రి బొంబాయి వెళ్లినసంగతి. పోతూ, "పిన్నిజాగ్రత్త" అన్నమాటలు జ్ఞప్తికొచ్చాయి. బూట్లు టకటకలాడించుకుంటూ గదిని సమీపించాడు. లోపల పిన్ని నిద్రిస్తుండొచ్చు. చూడకూడదనుకున్నాడు. చూడవద్దని మనస్సు, చూడమని వయస్సు రెండు కాసేపు తగవులాడాయి. వయస్సే గెలిచింది. మనస్సు బాధగా మూల్గింది. అప్పుడే "టివోలి" లో చూచిన ఇంగ్లీషు సినిమా రీళ్ళు రింయిన మనస్సులో తిరిగాయి. లోపలికి చూచాడు. ఒక్కసారి చకితుడయ్యాడు. ఆకాశం భూమ్మీద పడ్డదనుకున్నాడు. స్వర్గం, నరకం ఒకటేనన్నట్లనిపించింది. అబ్బ! పిన్ని ఎంత అందంగాఉంది. ఎర్రటి కోల ముఖం, తలంటిన వెంట్రుకలు ముఖం మీద పడ్డాయి. జుట్టుముడి సరిగా వేసుకోలేదు, చెవులకు రింగులు. నుదుట తిలకం, ఎర్రటి పెదిమలు. నవ్వుతుంది. ఎందుకో మధ్య మధ్య పలవరిస్తుంది. "నన్ను మోసంచేశారు". చక్కటి తెల్లని పలువరస. ఉచ్ఛ్వాసనిశ్వాసలకు అదరాలు ఊగుతున్నాయి. పమిట తొలగిపోయింది. ఈ భూమ్మీద ఇంత అందమైన ఆడవాళ్లున్నారా! సురేష్ గుండె అతివేగంగా కొట్టుకోసాగింది. తనకున్న

గర్ల్స్‌ఫ్రెండ్స్ ఒక్కళ్లు యిలాలేరే! సినిమాలోని ముద్దులు నగ్ననృత్యాలు, కౌగలింతలు. తను చదివిన శృంగార నవలల జ్ఞానం ఉక్కిరి బిక్కిరి చేసింది. తాగిన బ్రాంది. ఏమోచేయమని రక్తాన్ని ఉసిగొల్పింది. ఏదో తెలియని ఆవేశం తపన. అడుగులో అడుగువేసుకుంటూ సుజాత పడుకున్న మంచందగ్గర చేరాడు. మెదడు మొద్దుబారిపోయింది. సుజాత ప్రక్కన పడుకున్నాడు. గట్టిగా కౌగలించుకున్నాడు. గప్పున మల్లెలవాసన వచ్చింది. మగతలోఉన్న సుజాత చేయివేసి గట్టిగా కౌగలించుకుంది. "నన్ను మోసంచేశారు" మళ్లీ అదేపలవరింత. వెచ్చటి సురేష్ గాలికి సుజాత ఈ లోకానికి వచ్చింది. కండ్లుతెరచి. భర్త లేడన్నసంగతి అప్పటికిగాని తెలువలేదు. ఎవరో దొంగ అనుకుంది. ఆమెగుండె వేగంగా కొట్టుకోసాగింది. అరవబోయింది. అప్పడిగ్గాని ప్రక్కనున్నవాడు సురేష్‌అని తెలిసింది. లేచికూర్చుంది సురేష్ లేచినిల్చున్నాడు. అతనికాళ్లు వణుకుతున్నాయి. ముఖం చెమటపట్టింది. గొంతు తడారిపోయింది సురేష్ పరిస్థితి గమనించి వింతగా నవ్వింది సుజాత. అతనికండ్లు బాగాత్రాగి ఎర్రబడ్డాయి. చలిజ్వరం వచ్చినవాడిలా వణుకుతున్నాడు. గోడగడియారం 11 గం॥లు గొట్టింది. "తప్పయింది" .... అతని నోటెంట మాట రావడంలేదు. అతనిలో భయం ఆవరించింది. చేసిన పని నీచాతి నీచమైనది 'ఛ' అనుకున్నాడు. వెళ్ళిపోబోయాడు.

"సురేష్ కూజాలో నీళ్లున్నాయి, ముఖం కడుక్కోనిరా" అనుకోకుండా సుజాత నోటినుండి వచ్చిన మాటలకు విస్తుబోయాడు. మర బొమ్మలా మొఖం కడుక్కొవచ్చి కూర్చున్నాడు. బయటనుండి మల్లెలు సంపెంగలవాసన, గడ్డిపరకల మీదినుండి చల్లటిగాలి వీస్తుంది. సుజాత మొఖం కడుక్కొని నెత్తి సరిచేసుకుని వచ్చింది.

"మోసంచేశారు" అన్నమాటలు సురేష్‌కు జ్ఞప్తికొచ్చాయి.

ఎవరు మోసంచేశారు?

ఎవరినన్నా ప్రేమించిందేమో?

ఇంత వయసుమళ్లిన తనతండ్రి నెందుకుచేసుకుంటుంది?

"సురేష్" ముందు సుజాతే మందలించింది.

"తప్పయిందిపిన్ని" అతనికంఠం వణుకుతుం ,

తండ్రికితెలిస్తే యింట్లో ఉండనిస్తాడా!

"అది నీతప్పుకాదుబాబు నీవయస్సు. నీలోఉన్న యవ్వనోద్రేకం, త్రాగిన బ్రాంది వాటిదితప్పు. ఆ: ఈ రోజునీవుచూసిన సినిమా పేరేంటి"

"లవ్ ఇన్ ప్యారిస్" సుజాత పగలబడి నవ్వింది.

సురేష్ చేతిలో ఏదోపుస్తకంఉంది. ఎంత దాద్దామన్న దాగలేదు. రోజు రాత్రి అణా లైబ్రరిలో ఓపుస్తకంతెచ్చి చదవడం అతని అలవాటు.

"దాని పేరేంటిబాబు" ఆమే నోటినుండి వచ్చేమాటలు సురేష్‌కు తన తల్లిని జ్ఞప్తికి తెప్పించాయి.

"ప్రేమా! పెండ్లి! ఆ తర్వాత" అర్ధనగ్నంగా వున్న అట్టే సవాలు చేస్తుంది.

నీవు ఈ రోజు చూసిన సినిమా, నీవు కాలక్షేపానికి చదివే అర్థంలేని ఈ నవలలు నన్నీపనికి ఉపక్రమింపచేశాయి. నీ గర్ల్స్ ఎండ్ బోయిఫ్రండ్స్ నీవు తిరిగే వాతావరణం ఇవన్నీ కారణం. ఈ పట్టణాలల్లో సభ్యత సంస్కృతి పేరిట కొన్ని క్లబ్బులుంటాయి. అందులో పేకాట, త్రాగుడు, ఇంకా మనిషికిఉన్న అన్ని బలహీనతలకు తరిఫీదిస్తవి. ఇప్పుడు నీవు తిరిగేవి వాటివెంటనే. నీకున్న డబ్బుచూసి నీ గర్ల్స్ ఎండ్ బోయిఫ్రండ్స్ నీచుట్టూ మూగుతున్నారు. నీలోవున్న జ్ఞానాన్ని మత్తుగా జోకొడ్తున్నారు. నీవురోజోవంద ఖర్చుచేస్తావు నీ స్నేహితులకోసం. నీవుచూసే ఫారిన్ సినిమాలు, శరీరాన్ని వేడెక్కించే సెక్స్‌నవలలు వీటన్నీటితో నీ మెదడు మొద్దుబారిపోయింది. ఏవిధంగా ఎక్కడ ఛాన్సు దొరుకుతుందా అని చూస్తున్నావు. సిగ్గులేకుండా మాట్లాడు తున్నాననుకోకు.

సుజాత మాట్లాడే ఈ మాటలు సురేష్ గుండెకు సూటిగా తగిలాయి.
ఫ్లాస్కులోఉన్న కాఫీతెచ్చి అతనికిచ్చింది.
వంచిన తల ఎత్తలేదు సురేష్.
"తీసుకోబాబు" సురేష్ కాఫీత్రాగాడు.
నామాటలకేమైనా కోపమొచ్చిందా?
"లేదుపిన్ని ...."

పిన్ని ఈ ఇరవయ్యేండ్ల వయస్సులో ఇంత అనుభవం ఎలా సంపాదించింది. సిగిరెట్ కోసం జేబులు తడుముకొని మళ్లీ అపివేశాడు, ఇదిగమనించిన సుజాత "కాల్చుకోబాబు లేకుంటే నిద్రవస్తుంది".

ఓ సిగిరేట్ కాల్చాడు. అగదిలో వెలుతురు పొగ ఆడుకొంటున్నాయి బయటినుండి వచ్చేగాలి పొగను ఉయ్యాలలూపుతుంది.

"నీవు సారంగధరకథ వినేవుంటావు. అందులో చిత్రాంగి కొడుకు కోసం పరితపిస్తుంది ఈ రోజునీవు..."

"పిన్నీ నన్ను క్షమించు. ఈ రంపపుకోత కోయకు, ఒక్కసారి చంపెయి" అతినామాటలంటున్నప్పుడు గొంతు వణికింది తలఎత్తి సూటిగా సుజాతను చూడలేకపోయాడు.

'బాధపడకుబాబు! ఈ తప్పు నీదికాదు పరిస్థితుల ప్రభావమని చెప్పానుగా' చాలా సులభంగా అనగలిగిందామాటలు.

ఐదు నిమిషాలు మౌనంగా గడిచాయి.

"ఒక్కమాట పిన్నీ"

"అడుగుబాబు"

"మీరు నిద్రలో పదేపదే నన్ను మోసంచేశారు" అని పలవరించావు ఎందుకో...

"ఓ అదా నీ అనుమానం అయితె చెప్తావిను" గాలికి ముఖంమీద పడ్డ వెంట్రుకలు సరిచేసుకుంది.

సురేష్ నాకు సరిగ్గా ఇరువదేండ్లు, నీకు 22 ఏండ్లు. రేపు నాకు వచ్చే కోడలు వయస్సుకూడ ఇంతే ఉండవచ్చు. నేను మెట్రిక్ చదివా. ఆమె గ్రాడ్యువేటు అయుంటుంది. మీనాన్నకు నేను రెండోభార్యను అయితె యిది ఎంత చిత్రంగా జరిగిందనుకున్నావు. మీ నాన్న మా యింటికొచ్చాడు. నన్ను చూశాడు. నచ్చిందన్నాడు. తనకున్నది ఇద్దరు పిల్లలే అన్నాడు. ఇక్కడికొస్తె నలుగురున్నారు. అందుకు నేనేం బాధపల్లేదు. సరికదా సంతోషించాను. మా వాళ్లుజానీ కట్నం

యిచ్చుకోలేని పేదవాళ్లు. మీ నాన్నకానీ కట్నం ఆశించని పెద్దమనిషి. అందుకే ఈ పెళ్లికి ఒప్పుకున్నారు. ఆయన ఏ అర్ధరాత్రికొచ్చినా, ఎవరితో కలిసి తిరుగుతున్నా నేనేం బాధపడడంలేదు. వారికి కావలసినది చేస్తూనే ఉన్నాను. ఇక నా పలవరింత సంగతి. "అపుత్రస్యగతి: ర్నాస్తి" అన్నారు పెద్దలు. ఏ స్త్రీయైనా మాతృమూర్తి కావాలని, పిల్లలపెంచి పెద్దచేయాలని కలలుకంటుంది. నాకాయోగ్యతలేదని, మీనాన్న ఎప్పుడో వేసక్టమీ చేయించుకున్నాడని, వంటమనిషి చెప్పింది. ఇక ఈ యింట్లో నాస్థానం. నేనోదాసిని, మరబొమ్మను. వారికి కావలసినట్లల్లా ఉపయోగించుకుంటారు". ఆమె తనబాధనంతా చెప్పేసింది. కండ్లల్లో నీళ్లుతిరిగి చెక్కిళ్ళమీద పడ్డాయి.

"ఇంత మోసంచేశాడాపిన్నీ!" సురేష్అడిగాడు.

అవును సురేష్ సంఘంలో ఓ మగవాడు చేయిల్సిందే ఆయనాచేశాడు. ఈ సంఘంఉంది చూశావు మగవాడు పదిమంది పిల్లలున్నా నలుగురిని పెండ్లాడవచ్చు. పిల్లలు లేకపోతె ఇంకొకరిని, భార్యకు రోగంవస్తె ఒకరిని, ఇలా ఎంతమందినైనా పెండ్లాడడానికి ఒప్పుకుంటుంది. అదే ఆడది పిల్లలులేక ఇంకొకరిని పెండ్లాడితే ఎమంటుంది, భర్త రోగిష్టి అయితె ఇంకొకరిని పెండ్లాడితే? ఏమంటుంది. బరి తెగించింది, వ్యభిచారిణి, మొదలైన సర్టిఫికెట్లు ఉచితంగా సప్లయి చేస్తుంది. ఇక చేప్పాలంటే వీటికి అంతేలేదు. ఆమె ఆపివేసింది.

గోడగడియారం 3 గంటలు కొట్టింది. సురేష్ ఆలోచిస్తు కూర్చున్నాడు.

"ఇక్కడే పడుకోబాబు, నేను వరండాలో పడుకుంటా"

"వద్దుపిన్నీ!" అతని కండ్లనీళ్ళు షర్టుమీద పడ్డాయి.

"నన్ను క్షమించుపిన్నీ" అతని మన్సు బాధగా మూల్గింది.

"బాబూ జరిగిందానికి నువ్వేం బాధపడకు"

బయటకు వెళుతున్న సురేష్‌కు వెనుకనుండి మాటలు విన్పించాయి.

తెల్లవారింది. ఎనిమిదిగంటలయింది. సురేష్‌గది తలుపులు తెరుచుకోలేదు. పనిమనిషి రెండుసార్లు తలుపుతట్టి వెళ్ళిపోయింది. సుజాతతో చెప్పింది. రోజు 7 గంటలయితె టిఫిన్‌చేసి బయటకు వెళ్ళేమనిషి ఇంకాలేవలేదేం? ఆమెగుండె కొట్టుకో సాగింది. తలుపు గట్టిగాకొట్టింది. నాలుగుసార్లు పిలిచింది యింట్లోవాళ్ళంతా చేరారు. నలుగురు మనుష్యులు బలవంతాన తలుపులు తెరిచారు. సురేష్ మంచంమీద పడుకునే వున్నాడు. సుజాతపోయి లేపింది. శరీరం ఆమె చేయికి చల్లగా తగిలింది. మంచం

క్రింద నిద్రమాత్రలసీసా కాలుకు తగిలి దొర్లిపోయింది. బయటనుండి సూర్యకిరణాలు అతనిముఖాంమీదపడి ఎర్రెగా మెరుస్తున్నాయి. టేబుల్‌పై కాగితం గాలికి రెపరెప లాడింది. సుజాత కాగితాన్ని చదవసాగింది.

ప్రియమైన పిన్ని పాదపద్మములకు,

నమస్కారం.

రాత్రినేనుచేసనపని, బహుశా ఏ మనిషి చేయలేదనుకుంటా! అయినా తప్పుచేయకుండానే జ్ఞానోదయాన్ని కలిగించావు. ఈ జన్మలో ఇక నీ యెదుట ఈ పశుసంస్కారంతో తిరగలేను. వచ్చేజన్మలో నీ కొడుగ్గా పుడుతా దీవించు.

నీ కొడుకు,

సురేష్.

సుజాత కన్నీళ్లతో ఉత్తరం తడిసిపోయింది బాబూ నా జ్ఞానానికి నిన్ను బలిచేశా. ఆనాడు సారంగదరుని చిత్రాంగి చంపిస్తే ఈనాడు నేను యింట్లోనిన్ను చంపేశా .... ఆమె శవంమీదపడి బోరున ఏడ్వసాగింది. చుట్టు ఉన్నవాళ్లకేం అర్థంకాలేదు. ఆమె స్పృహతప్పి అతనిమీద పడిపోయింది. *


## రచయితలకు, రచయిత్రులకు విజ్ఞప్తి

మా "దర్పణం" కోసం మీ విలువైన రచనలు ఆహ్వానిస్తున్నాం ప్రచురణార్థం పంపే మీ రచనలు తగినన్ని స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరు మాత్రం జతపరచాలి. లేకున్నచో తిరిగి పంపటం సాధ్యపడదు.

ప్రచురణార్హమైనవి మాకందిన 15 రోజులలో తెలుపగలం.

దర్పణం
త్రైమాసిక
నల్లగొండ.